జీడి, టేకుతోట దగ్ధం

విశాలాంధ్ర-మెలియపుట్టి: మెలియాపుట్టి మండల కేంద్రంలో మెలియాపుట్ నుండి పెద్ద పద్మాపురం వెళ్లే రహదారి మార్గంలో మాడుగుల రమేష్ అలియాస్ రవికి చెందిన సుమారు 7 ఎకరాలు జీడి,టేకు తోట అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. గురువారం నాడు తోట నుండి 12 గంటల ప్రాంతంలో మంటలు, పొగ వస్తుండడంతో ఆ రహదారి వెంబడి వెళ్లే వారు చూసి సంబంధిత మాడుగుల రమేష్ కు తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో కొంతవరకు మంటల్ని అదుపు చేయడంతో పాటు వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సైతం సకాలంలో వచ్చి సుమారు రెండు గంటలు సమయంలో మంటల్ని నిలువురించగలిగారు. జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానిక అగ్నిమాపక సిబ్బంది అంచనా వేసినట్టుగా తెలుస్తుంది. జీడి, టేకు తోటలో మంటలు ఎలా వ్యాపించింది తదితర వివరాలు తెలియరావలసి ఉంది.

ఐజేయు అధ్యక్షునికి అరుదైన గౌరవం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షులు కే శ్రీనివాసరెడ్డికి అరుదైన గౌరవము లభించినట్టు, జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యూబా రాజధాని హవానాలో జరుగుతున్న అంతర్జాతీయ మీడియా సదస్సుకు భారతదేశ ప్రతినిధిగా శ్రీనివాస్ రెడ్డికి అందిన ఆహ్వానం మేరకు, ఆయన ఆ సదస్సులో మాట్లాడే అవకాశం లభించిందని తెలిపారు.' తప్పుడు సమాచారం మరియు మీడియాలో వస్తున్న మార్పులను ఎదుర్కోవడం' అనే అంశంపై ఆయన ఒక సిద్ధాంత పత్రాన్ని సదస్సుకు సంబంధించినట్టు తెలిపారు. క్యూబా దేశ అధ్యక్షుడు కానెల్ ప్రారంభించిన ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. శ్రీనివాస రెడ్డికి అందిన ఈ గౌరవం భారతీయ జర్నలిస్టుల సమాజానికి అందినట్టేనని ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు అన్నారు. గర్వకారణమైన ఆయన నాయకత్వంలో పనిచేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీనివాస్ రెడ్డికి దక్కిన గౌరవం పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిక్కోలు జగదీష్, సనవల రమేష్ కూడా వర్షం వ్యక్తం చేశారు.

22 నుండి కేజీబీవీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ : ప్రిన్సిపాల్ సంతోషి

విశాలాంధ్ర- హిరమండలం /పాతపట్నం: ఈనెల 22వ తేది నుంచి కస్తూరి బా గాంధీ బాలికల విద్యా లయంలో 6వ తరగతి ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం లో ప్రవేశం నకు ఆన్లైన్లో దరఖాస్తు లు చేసుకోవాలని పాతపట్నం కేజీబీవీ ప్రిన్సిపాల్ కే.సంతోషి పత్రికా ముఖంగా తెలియజేశారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ దరఖాస్తు (హెచ్‌టీటీపీఎస్:// ఏపీకెజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్) సైట్ ద్వారా పొందగలరు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని. సంబంధితకేజీబీవీ పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చునని ప్రిన్సిపాల్ కే సంతోషి తెలియజేశారు.

ప్రతి పేదవానికి పక్కా ఇల్లు ఉండాలి

ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాల ప్రతి పేదవాని కి పక్క ఇల్లు ఉండాలని కూటమి ప్రభుత్వం ము ఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అధిక మొత్తాలను అందిస్తు న్నట్లు స్థానిక ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. పి ఎం ఏ వై అర్బన్, బి ఎల్ సి వారికి, పీఎం గ్రామీణ్, పీఎం జనం పథకాల ద్వారా ఇల్లు మంజూరైన వారికి ఈ పథకం వర్తిస్తుంది. గురు వారం కార్యాలయం విడుదల చేసింది పైన తెలిపిన స్కీమ్ లో స్లాబ్ వరకు నిర్మాణం జరిగి అసంపూర్తిగా ఉన్నవాటికి ప్రభుత్వం అదన పు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచే యాలని కోరారు.

మహిళల భద్రతే శక్తి టీం లక్ష్యం

విశాలాంధ్ర -మందస: మహిళల భద్రతే శక్తి టీం లక్ష్యమని ఎస్సై రాజేష్ అన్నారు. గురువారం, హరిపురం కైజాన్ పాఠశాలలో విద్యార్థులకు శక్తియాప్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "శక్తి టీమ్" అంటే మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక బృందం, ఇది ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు, ఇతరుల వేధింపులు, మరియు ఇతర నేరాలను నివారించడానికి పనిచేస్తుం దన్నారు. ప్రతి మహిళా తమ ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని ఏదైనా ప్రమాదం తలిస్తే యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటన్ నొక్కితే బాధితులు ఉన్న లొకేషన్ ను పోలీసులు గుర్తించి తక్షణమే స్పందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మందస ఏ ఎస్సై నీలకంఠేశ్వరరావు, శక్తి టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా పై చర్యలు తీసుకోండి

జిల్లా వైద్య శాఖాధికారికి వినతిపత్రం ఇచ్చిన ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లా స్థాయిలో ప్రతి చోటా జరుగుతున్న మెడికల్ మాఫియాను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ లు కోరారు. జిల్లా వైద్య శాఖ అధికారి బాలమురళీకృష్ణ కి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనేక హాస్పిటల్ లో ధరల పట్టికను డిస్ప్లే చేయకుండా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద వేలాది రూపాయలను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ టెస్టు, ల్యాబ్, స్కానింగ్ రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని, స్కానింగ్ అవసరం లేనప్పటికీ ప్రజలను భయభ్రాం తులకు గురిచేస్తూ స్కానింగ్ తీసి సొమ్మును దోచుకుంటున్నా రన్నారు. హాస్పిటల్ నుండి పేషెంట్లు డిశ్చార్జ్ అయిన తర్వాత వారికి బిల్లులు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. కమిషన్లకు అలవాటు పడి ఫార్మా కంపెనీ లు, మెడికల్ ఏజెన్సీలు బోగస్ మందులను విక్ర యిస్తూ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో ఉన్న డాక్టర్లు సేవా దృక్పథాన్ని పక్కనపెట్టి వ్యాపార దృక్పథంతో పేద,మధ్యతరగతి , బలహీన వర్గాల ప్రజల అమాయకత్వాన్ని అలుసుగా తీసుకొని లక్షలాది రూపాయలు దండుకుంటున్న పరిస్థితి జిల్లా మొత్తం వ్యాపించిందని, జిల్లాలో కొన్ని హాస్పిటల్స్ కు పర్మిషన్, ఫైర్ సేఫ్టీ లేకుండా యాజమాన్యం హాస్పిటల్స్ ను నడుపుతున్నాయన్నారు. జిల్లాలో చాలామంది ఆర్ఎంపీ డాక్టర్స్ పర్మిషన్స్ లేకుండా క్లినిక్ లు ఏర్పాటు చేసుకున్నారని వెంటనే వీరి ఆగడాలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో భవిష్యత్తులో ఏఐవైఎఫ్ అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అర్.అరవింద్ , టి. మధు, జి. వసంత్, జె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యను బాధ్యతగా అమలు చేయండి

మున్సిపల్ కమిషనర్ నడిపేన

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. గురువారం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీలో గల సచివాలయంకు చెందిన ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించి, అమలు చేయవలసిన బాధ్యత మీపై ఉందని చెప్పారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టడం, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి తల్లి దండ్రులను చైతన్యవంతం చేయడం మరియు ప్రతివారం పురపాలక సంఘం పరిధిలో గల పాఠశాలలను సందర్శించి బాలికలతో సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చట్టాల పట్ల బాలికలను చైతన్యవంతులుగా చేయాల్సిన బాధ్యత ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శుల పై ఉందన్నారు. దీంతో పాటు తల్లి, తండ్రి లేని పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రతినెలా అందిస్తున్న 4 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, పిల్లలు మరియు వారి సంరక్షకుల పేర్లపై జాయింట్ అకౌంట్ ను బ్యాంకు లో ఖాతా తెరిచి వారికి ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు.

వంశధార ప్రాజెక్టు ను ఆధునీకరణ చేయాలి : ఎమ్మెల్యే ఎంజీఆర్

ఆయకట్టు చివరి ఎకరా వరకూ సాగునీరు అందించాలి

విశాలాంధ్ర-హిరమండలం/ పాతపట్నం: అధ్యక్షా... వంశధార మా సిక్కోలు రైతులకు జీవన ధార, అలాగే వంశధార మా శ్రీకాకుళం జిల్లాకే తలమానికం అలాంటి వంశధార ప్రాజెక్టు కుడి,ఎడమ కాలువలలో పూడిక తీసివేసి ఆధునీకరణ పనులు ప్రారంభించాలని ఇరిగేషన్ స్కీమ్ లపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మరోసారి గురువారం పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు వినిపించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు చూ లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా 12 మండలాలలో సుమారు లక్షల యాభై వేలు ఎకరాలకు గానూ సాగునీరు అందించాలి అలాగే రైట్ మెయిన్ కెనాల్ ద్వారా 7 మండలాలకు నీరు అందించే సామర్థ్యం ఉన్నా గత ప్రభుత్వం పూర్తిగా ఇరిగేషన్ పథకాలపైనే కాకుండా రైతులపై కూడా చిన్న చూపు చూడడంతో కాలువలు మరమ్మతులకు గురై ఆయకట్టు వరకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అయితే ఎల్లప్పుడూ రైతుల శ్రేయస్సును కాంక్షించే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తక్షణమే చర్యలు చేపట్టి వంశధార ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ పనులు చేపట్టి,అవసరమైన చోట ఎత్తైన ప్రాంతాలకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఏర్పాటు తోపాటు ప్రాజెక్టు లెఫ్ట్,రైట్ మెయిన్ కెనాల్ లో 100 ఎమ్ ఎమ్ సిసి లైనింగ్ ను ఏర్పాటు చేస్తే శ్రీకాకుళం జిల్లా రైతాంగం సస్యశ్యామలంగా పంటలు పండించుకుంటుందని అసెంబ్లీ లో విన్నవించుకున్నారు..

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విద్యుత్ ఏఈలకు వినతులు అందజేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రీకాకుళం విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ రీడర్స్ గా విధులు నిర్వహిస్తున్న కార్మికులను నేడు ప్రభుత్వాలు రోడ్డున పడేసాయని వారు వాపోయారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఎవరికి ఉపయోగం అని ప్రశ్నించారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత ప్రకారంగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎస్ క్రో అకౌంట్ ద్వారా వారి జీతాలను చెల్లించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం విద్యుత్ డిఈ, ఎస్ఈ ల కు తమ న్యాయపరమైన డిమాండ్లను వినతి పత్రం ద్వారా తెలియజేశారు. అనంతరం వారు సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చాపర వెంకటరమణ, రాష్ట్ర మీటర్ రీడర్స్ కమిటీ ఉపాధ్యక్షులు జె . ప్రేమ్ భూషణ్, బయపల్లి ఓంకార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమారస్వామి, భాస్కరరావు, నాయకులు శ్రీనివాస్, బాలకృష్ణ, వేణు, సంతోష్ , పెద్దఎత్తున మీటర్ రీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

వంశధార ఎడమ కాలువను ఆధునీకరించండి: అసెంబ్లీలో ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-నరసన్నపేట: జిల్లాలోని హిరమండలం వద్ద ఉన్న గొట్టా బ్యారేజ్ నుండి సాగునీరు అందిస్తున్న ఎడమ కాలువలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరించాలని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి శాశనసభలో కోరారు. గురువారం ఆయన రాష్ట్ర శాశనసభలో మాట్లాడుతూ వంశధార ఎడమ కాలువ ద్వారా సుమారు 1.64లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. దీనిలో ఎక్కువ భాగం నరసన్నపేట నియోజకవర్గానికి సుమారు 70వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రొజెక్ట్ నిర్మాణం చేసి నేటికి 75సంవత్సరాలు పూర్తి కావటంతో కాలువను ఆధునీకరించక పోవటం వలన వర్షాకాలంలో వ్యవసాయ భూములకు సాగునీరు అందించే ఈ కాలువ భారీ వర్షాలకు అత్యధికంగా వరద నీరు పోటెత్తటంతో వరి పొలాలన్నీ ముంపునకు గురి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వం ప్రొజెక్ట్ పనులు గాలికి వదిలివేయటం వలన ముంపు సమస్య అధికంగా ఉందన్నారు. వంశధార ఎడమ కాలువను ఆధునీకరించినట్లయితే నరసన్నపేట నియోజకవర్గంతో పాటు టెక్కలి, పలాస, సొంపేట, ఇఛ్ఛాపురం వరకూ సాగునీరు వ్యవసాయ భూములకు శత శాతం అందుతాయన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నేడే ఒక ప్రణాళిక సిద్ధం చేసి, నిధులు మంజూరు చేసినట్లయితే వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి నరసన్నపేట నియోజకవర్గం నుండి ఇఛ్ఛాపురం నియోజకవర్గం వరకూ సాగునీరు సరఫరా సక్రమంగా వరి పొలాలకు అందుతాయన్నారు.

గేట్లో ఆర్జీయూకేటీ శ్రీకాకుళం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు గేట్లో ప్రతిభ కనబరిచారు. ఈ క్యాంపస్లో కోమర్ల శ్వేత 241వ ర్యాంకు, అప్పన శ్రీనివాస్ 663వ ర్యాంకు, పెనుమర్తి గౌతమ్ 405వ ర్యాంకు. కేశవరావు మూర్తి 655వ ర్యాంకు, ఎస్. తిలక్ సూర్య 937 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఇక్కడి క్యాంపస్లో కేక్కు క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ కట్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా మరింత ఆసక్తి చూ పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎఫ్వో వాసు, వెల్ఫేర్ డీన్ రవి తదితర లు పాల్గొన్నారు.

పోషకాహారం విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఐసిడిఎస్ పిడి శాంతి శ్రీ

విశాలాంధ్ర -ఆమదాలవలస: జీవితంలో ప్రతి దశలో పోషకా హారం పై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా విమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ మరియు సాధికార అధికారిని బి శాంతి శ్రీ అన్నారు. గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వా డీ కార్యకర్తల శిక్షణ మొదటి రోజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డారు. ఈ కార్యక్రమాన్ని పోషన్ పక్వాడ మార్చిలో జరుపు కుంటున్నట్లు వివరించారు. 0 నుండి ఆరు సంవత్సరాలు వయసు గల పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు పోషక ఆహార స్థితిలో మెరుగు దలను సకాలంలో సాదించే విధంగా పోషక విలువలు అందించే టట్టు చూడాలన్నారు. పోషకా హారం విద్యతోనే చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అనురాధ, సూపర్వైజర్లు మాట్లాడుతూ న్యూట్రిషన్, ఆదర్శ ల వంటి విధానాలపై వివరిం చారు. మొదటిరోజు శిక్షణలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -రణస్థలం: మండలం రణస్థలం గ్రామం లో మొదటి సారి రాష్ట్రం లోనే అత్యంత అరుదుగా నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ గ్రామ సర్పంచ్ చొరవతో ఏర్పాటు చేయడం జరిగింది. మారుతున్న జీవన శైలిలో క్యాన్సర్ మహ మ్మారి మహిళలను ఇబ్బంది పెడుతుందని. పంచాయతీ పరిధిలో ఏ మహిళ కూడా క్యాన్సర్ బారిన పడకూడదు అని అత్యంత ఖరీదైన ఒంకలజిస్ట్ కన్సల్టెన్సీ, మెమోగ్రాఫి, అల్ట్రాసౌండ్, పాప్స్మియర్, చేస్ట్ ఎక్సారే వంటి పరీక్షలు జేమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేయడం జరిగింది. కార్యక్రమంలో కలిశెట్టి సూర్యనారాయణ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు మరియు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీలి లినాయుడు కోరుచున్నారు. ఈ కార్యక్రమం లో జేమ్స్ హాస్పిటల్ %ణతీ% ప్రవీణ్ సింహాచలం రాంబాబు ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకట రమణ, ఎక్స్ సర్పంచ్ మహదాసు రమణయ్య , ప్రదీప్ , వార్డ్ మెంబర్ లక్ష్మీ నాయుడు సీతారాం వెంకట్రావు గొర్ల రమణ పులివెందుల శంకర్ అన్న నాయుడు యువత మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులందరూ పిచ్చుకలను సంరక్షించే బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-పొందూరు: ప్రపంచ వాతావరణ కాలుష్యం కారణంగా పిచ్చెకలు అంతరించకుండా చూసేందుకు విద్యార్థులందరూ పిచ్చుకులను సంరక్షించే బాధ్యత వహించాలని తాడివలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య,నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ సమన్వయ కర్త పూజారి హరిప్రసన్న తెలిపారు. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. చూడముచ్చటిగా కనిపించి ఈ చిన్ని ప్రాణికి వేసవి తాపానికి మంచినీటిని అందుబాటులో చూపించాలని కోరారు. పిచ్చుక సంరక్షణ దైవ సేవగా భావించి మెరుగైన ఆహారాన్ని అందించాలని విద్యార్థులకు హితవు పలికారు.పిచ్చుకలను కాపాడుకుంటేనే జీవవైవిధ్యం కాపాడుకోవచ్చంటూ డ్రాయింగ్ టీచర్ రాధాకుమారి గీసిన చిత్రాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతరించే పక్షులలో పిచ్చుకలు ఉండడం ఆందోళనకు గురి చేసే అంశమని అన్నారు. వ్యవసాయ దిగుబడులకు పిచ్చుకలు సహకారిగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్, రావాడ పాపారావు,తదితరులు పాల్గొన్నారు.

శిధిలావస్థలో విద్యాలయం

విద్యార్థుల భవిష్యత్ కు భరోసా ఎవరు

విశాలాంధ్ర -నరసన్నపేట... విశాలాంధ్ర -నరుబజ్జిలి: రొట్టవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఒకవైపు పెచ్చులు ఊడిపోతున్నా పాఠశాల లో విద్యాభ్యాసం ఏ క్షణంలో పెచ్చులు తలపై పడ తాయో అని భయం గుప్పిట్లో విద్యార్థుల తల్లితండ్రులు. ప్రైవేట్ విద్యాలయాలలో చదివించలేని పరిస్థితి. మొరోవైపు పాఠశాల చుట్టూ పేరుకు పోయిన చెత్త కుప్పలు, ఎటు చూసిన దుర్గంధం భరించలేని దుస్థితి. నాయకులు, అధికారిలు స్పందించి నూతన భవనం ఏర్పాటు చేయాలనీ విద్యార్థుల వారి తల్లితండ్రులు వాపుతున్నారు. దేశ భవ్యాశత్ దుష్ట్యా విద్యార్థుల కు అన్యాయం కుండా త్వరితగతిన న్యాయం చెయ్యాలని స్థానికులు, ఉపాధ్యాయలు కోరుతున్నారు.

22 సారా బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం అశోక్ థియోటర్ వద్ద ఎస్ఐ రవివర్మ తనిఖీలు చేస్తుండగా చిన్న కపాసుకుద్ది గ్రామానికి చెందిన యర్ర. కూర్మారావు అనే వ్యక్తి కవిటిలో కొనుగోలు చేసిన 22 బాటిల్స్ బెల్ట్ షాప్కు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ఆ వ్యక్తిని అదవులోకి తీసుకుని బాటిల్స్ స్వాదీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చుస్తున్నట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర -పలాస: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పలాస ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్ ను అమలు చేయాలని, పనిష్మెంట్లు ఏకపక్షంగా తీసుకోవద్దని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పదవి విరమణ పొందిన ఉద్యోగస్తుల స్థానాలను భర్తీ చేయాలని కోరారు. యూనియన్ కార్యదర్శి ఏ వి రావు, వున్నయ్య, ఎల్ నారాయణ, వాలి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులను గాలికి వదిలేసారు

విశాలాంధ్ర-కవిటి: ఉద్దానం లో కిడ్నీ బాధితు లను ప్రభుత్వం గాలికొదిలేసిందని శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం విజయవాడ శాసనమండలి వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ప్రభలతున్న దృశ్య గత ప్రభుత్వం రూ. 700 కోట్లతో హిరమండలం నుంచి ఉద్దానం ప్రాంతానికి తాగుననీరు తీసుకువచ్చామని, పలాసలో కిడ్నీ రోగులకు రూ. 79 కోట్లు వెచ్చించి 200 పడకలతో రీసెర్చ్ కేంద్రాన్ని నిర్మించామని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కిడ్నీ రోగులను గాలికి వదిలేసిందని విమర్శించారు. డయాలసిస్లో ఒకరు చనిపోతేగాని మరొకరికి బెడ్డు ఇచ్చే పరిస్థితి ప్రస్తుతం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చాపురంలో తక్షణం డయాలసిస్ కేంద్రం ప్రారంభించాలని, కవిటి, సోంపేటలో డయాలసిస్ యూనిట్లు పెంచాలని కోరారు. ఆయా కేంద్రాల్లో కిడ్నీ రోగులకు మరింత సదుపాయాలు కల్పించాలని కోరారు.పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరింత వైద్య సదుపాయాలు సమకూర్చాలని అన్నారు. గత ప్రభుత్వం కిడ్నీ రోగులకు అందజేసిన రూ. 10 వేలు పెన్షన్కు అదనంగా మరో రూ. 5 వేల ఈ కూటమి ప్రభుత్వం ఇప్పించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎన్నికలు ముందు ఉద్యోగులకు అన్ని ప్రయోజనాలు సకాలంలో నెరవేర్చుతాం అని హామీ నిచ్చి ఎన్నికల తర్వాత ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అసలు ఉద్యోగులు వైపే చూడడం లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో గురువారం ఎస్టీయు జిల్లా నాయకుల అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కూటిమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ప్రతీ నెల ఒకటో తేదీన జీతం , గతంలో కొన్ని నెలలు తరబడి సీపీయస్ మ్యాచింగ్ గ్రాంట్, బకాయిలు 500 కోట్లు ప్రాన్ అకౌంట్కు విడుదల చేశారన్నారు. ఈ రెండూ తప్ప ఉద్యోగులకి గత ప్రభుత్వం ఆరేళ్ల కాలంలో బకాయిపడ్డ రూ. 21,980 కోట్లు, ఇప్పుడూ వరకు అన్నీ కలిపి దాదాపు 32 వేల కోట్లు బకాయిలు పడ్డారన్నారు. వీటి కోసం ఒక కార్యాచరణ గాని ఫలానా సమయంలో ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని హామీ గాని, బకాయిలు విడుదలపై ఒక షెడ్యూల్ ప్రకటన గాని లేకుండా కూటమి నేతలు కాలపయాపన చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి 21 నెలలు గడుస్తున్నా 12 వ వేతన సవరణ కమిషన్ చైర్మన్ నియా మకమే లేదన్నారు. ఐఆర్ ప్రకటన లేదని, పెండింగ్ డిఎలు ఇవ్వలేదని, ఏపీజీఎల్ఐ, పిఏఫ్ లోన్లు, రిటైర్మెంట్ చెల్లింపులు నెలలు తరబడి ఆగిపోయాయని వీటిపై చర్చించేందుకు ప్రభుత్వం తమకు సమయమే ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని లేని పక్షాన కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల ఆగ్రహం తప్పదని హెచ్చరించారు. తక్షణమే స్పందించి బకాయిలపై ఒక స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతల రామారావు, కె.శ్రీనివాసరావు, ఎం. మురళి, జి శ్రీను, సిహెచ్ జగన్, డీవీఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తలకు పోషణ్-భీ, పడాయి-భీ పై శిక్షణ

- మూడు రోజులు పాటు కార్యకర్తలకు శిక్షణ

- అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్లుగా అభివృద్ధి

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలకు పోషణ్ - భీ, పడాయి - భీ అనే కార్యక్రమం పై మూడు రోజులపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పిల్లలకు ఆరేళ్ల వయసులోనే 85శాతం మెదడు అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. ఆ సమయంలో సరైన పోషణ, విద్యను అందించడం ఎంతో అవసరమని, ఇందుకోసం కేంద్రం పోషణ్ - భీ, పడాయి - భీ అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. పిల్లల శారీరక, అభివృద్ధి, సామాజిక, భావోద్వేగ, నైతిక అభివృద్ధి, సంస్కృతిక, మాతృభాష, కమ్యూనికేషన్, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పిల్లలకు సరైన పోషక ఆహారం అందించడం ద్వారా వారి శారీరక మరియు మానసిక అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. అంగ న్వాడి కేంద్రాలను ప్రీ స్కూల్ లాగా మార్చడం ద్వారా పిల్లలకు ప్రారంభ విద్యభ్యాసం అందించ డం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలకు పోషణ మరియు విద్య రెండిటిని పైన ఈ మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో 0 నుంచి 3 సంవత్సరాలు, మూడు నుంచి 6 సంవత్సరాలు పోషణ మరియు ప్రీస్కూల్ విద్యా ఏ విధంగా చేయాలి, ఎలాంటి ప్రయోజనాలు జరుగుతాయని వివరించారు. టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 228 కేంద్రాలలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు మూడు బృందాలు చొప్పున శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందులో భాగంగా నేడు సుమారు 120 మంది అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు అదనపు సిడిపిఓ ఉమామహేశ్వరి, సూపర్వైజర్లు సంధ్యారాణి, శారదాబాయ్, లక్ష్మి, జలజాక్షి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను వినియోగించుకోండి

విశాలాంధ్ర - మందస : కూటమి ప్రభుత్వం ఒడియా బ్రాహ్మణులకు 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శివాజీ పాణిగ్రాహి అన్నారు. గురువారం మందస శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ పాణిగ్రాహి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మ ణులకు ఇస్తున్న 50 శాతం సబ్సిడీ రుణాన్ని ప్రతి ఒక్క బ్రాహ్మణుడు వినియో గించుకుని ఆర్థిక స్వావలంబన సాధిం చాలని పిలుపునిచ్చారు. ఏపీ ఓబీ ఎం ఎం ఎస్ ద్వారా ఈనెల 22 లోపున ఆన్ లైన్ లో రుణం కోసం దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పాణిగ్రాహి మరియు మందస సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ వ్యవసాయ డిపో స్థలంపై కన్ను..?

కోట్లాది రూపాయల విలువ గల వ్యవసాయ కార్యాలయం కబ్జాకు వ్యూహం ..!

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో కోట్లు విలువైన వ్యవసాయ శాఖకు చెందిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాశీబుగ్గ పలాస ప్రధాన రహదారి కేటీ రోడ్డుకు ఆనుకొని క్రిస్టియన్ ముస్లిం స్మశానానికి ఎదురుగా ఉన్న వ్యవసాయ డిపో స్థలాన్ని కాజేసేందుకు కొంత మంది ఆక్రమణదారులు దృష్టి కేంద్రీకరించినట్లు సమాచారం. సుమారు 70 ఏళ్ల నుండి పలాస వజ్రపుకొత్తూరు మండలాల రైతాంగానికి అందుబాటులో ఉన్న వ్యవసాయ డిపో ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుంది. వ్యవసాయ డిపోకు చెందిన కొంత స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు భవన నిర్మాణాలు చేపట్టడం జరిగింది. దాన్ని తొలగించేందుకు వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు చర్యలు తీసుకునే సమయంలో వారు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే రావడం ప్రస్తుతం యథాస్థితిలో ఉండడంతో అధికారులు ఏమి చేయలేకపోయారు. డిపో ఎదురుగా కొంత మంది చిరు వ్యాపారులు బడ్డీలు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అలాగే డిపో ఆవరణలో మొక్కలు అమ్మకాలు కూడా జరుగుతున్నాయి.కాగా వైసీపీ ప్రభుత్వం పాలనలో గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల వ్యవస్థతో పాటు రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పడంతో వ్యవసాయ శాఖ కార్యాలయం, గోడౌన్ ల వ్యవస్థ నిర్వీర్య మైంది. ఈ తరుణంలో గత జనవరిలో ఆక్రమించి నిర్మాణం చేపట్టిన భవనాన్ని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ దినకర్ పుండ్కర్ రావడం శిధిలావస్థకు చేరుకున్న వ్యవసాయ డిపో భవనాన్ని కూడా పరిశీలించడం జరిగింది. ఈ ప్రాంతం నుంచి డిపోను తరలించేందుకు అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అత్యంత విలువైన వ్యవసాయ శాఖ భవన సముదాయం స్థలంను కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయంలో ఏవో స్థాయి అధికారి రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సూచనలు సలహాలు ఇస్తున్నారు. ఈ కార్యాలయమును తరలిస్తే రైతులు అనేక ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొంటాయి. ఇది ఇలా ఉండగా వ్యవసాయ శాఖకు చెందిన కార్యాలయంకు సంబంధించి మున్సిపాలిటీకి సంబంధం లేకపోయినా వాటి డాక్యుమెంట్లను చూపించాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వ్యవసాయ శాఖ అధికారులకు కోరినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మరో అడుగు ముందుకేసి తన సిబ్బందితో కొలతలు మార్కింగ్ వేసినట్లు కూడా ఆరోపణలు వినవస్తున్నాయి. కమిషనర్ రామారావు వ్యవసాయ శాఖకు చెందిన స్థలంపై ఎందుకు మక్కువ చూపిస్తున్నారో అంతు చిక్కటం లేదని పలువురు పేర్కొంటున్నారు. గతంలో 2018 లో కాశీబుగ్గ బస్టాండ్ ప్రాంతంలో గల కోట్లాది రూపాయలు విలువగల పాత అగ్నిమాపక కేంద్రం స్థలాన్ని 99 ఏళ్లు లీజుకు కాజేసేందుకు కొంతమంది ప్రయత్నాలు చేయడం దీన్ని విశాలాంధ్రలో ' అమ్మకానికి అగ్నిమాపక కేంద్రం' శీర్షికన కథనాలు రావడంతో అప్పటి టెక్కలి ఆర్డీవో వెంకటేశ్వరరావు ఆ ప్రతిపాదనను అప్పట్లో విరమించుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అన్నా క్యాంటీన్ వెలిసింది. అదే తరహాలో ప్రస్తుతం వ్యవసాయ శాఖ కార్యాలయంను వేరే చోటుకు తరలించి ఆ స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు కొంతమంది మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా శిధిలావస్థకు చేరుకున్న వ్యవసాయ శాఖ డిపో ను అభివృద్ధి చేయాలని, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఇటీవల రైతాంగం తరపున రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్ కుమార్ పలాస ఆర్డిఓ జి.వెంకటేష్ కు వినతిపత్రం కూడా అందించారు. వ్యవసాయ శాఖ కార్యాలయం తరలిస్తే రైతులతో ఆందోళన చేపడుతామని అజయ్ కుమార్ హెచ్చరించారు. ఈ విషయమే వ్యవసాయ శాఖ ఏడి మధు వద్ద ప్రస్తావించగా కార్యాలయం తరలింపు విషయమై తన దృష్టికి వచ్చిందని అలా జరిగే పరిస్థితి ఉండదని తెలిపారు. కార్యాలయం అభివృద్ధికై నిధులు కేటాయించాలని పై అధికారులను కోరామని నిధులు మంజూరు అయిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు.

సిరిమానోత్సవానికి ముస్తాబైన పోలవరం

అంగరంగ వైభవంగా పాసిపోలమ్మ తల్లి ఉత్సవాల ఏర్పాట్లు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో పోలవరం గ్రామంలో 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరుగునున్న సిరిమాను జాతరకు ముమ్మర ఏర్పాట్లు అంగరంగ వైభవంగా గ్రామ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. ప్రతి 9 సంవత్సరాల కి ఒకసారి గ్రామంలో ఈ పండగను జరుపుకుంటామని గ్రామ నిర్వాహకులు చెబుతున్నారు. గ్రామంలోకి అడుగుపెట్టే మొదటి సింహద్వారం నుండి గ్రామ ఆఖరి వరకు భారీ పెద్ద ఎత్తున సింహద్వారాలు విద్యుత్ దీపాల అలంకరణలతో ఏర్పాట్లు చేస్తున్నారు. 21వ తేదీ శుక్రవారం నాడు దేవర తెచ్చుట నుండి ఈ పాసిపోలమ్మ తల్లి గ్రామ దేవతకు సిరిమానోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు నుంచి గ్రామంలో వచ్చని మామిడి తోరణాలతో, విద్యుత్ దీపాల అలంకారాలతో ప్రతి ఇంటా గ్రామం అంతా పండగ వాతావరణం నెలకుంటూ మొదలవుతాయి. 25వ తేదీ మంగళవారం నాడు పాసిపోలమ్మ తల్లి సిరిమానోత్సవం, ఘటాలు ఊరేగింపు, అనుపోత్సవంతో అంగరంగ వైభవంగా మురాటలతో గ్రామ దేవతకు చల్లదనం చేస్తారు. ఈ గ్రామదేవత పండగకు జిల్లాల నుండి రాష్ట్రాల నలుమూలల నుండి గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులంతా పెద్ద సంఖ్యలో గ్రామ వీధులలో ఇసుకేస్తే రాలనంతగా విధంగా జన సంహారం వాతావరణంతో కిక్కిరిసిపోతాయి. ఈ గ్రామ దేవతను కొలిచిన వారికి కోరిన కోరికలల్ల నెరవేర్చే మహిమ ఉందని ఆ గ్రామ ప్రజల నమ్మకం. అందుకే ఈ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా ఘనంగా గ్రామస్తులు నిర్వహిస్తుంటారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గీత సాగర్

విశాలాంధ్ర - ఆమదాలవలస : పురపాలక సంఘ అభివృద్ధికి మంజూరైన నిధుల తో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీతా సాగర్ తెలిపారు. గురువారం 9, 10 వ వార్డుల్లో 13.02 లక్షలతో సిమెంట్ రహదారుల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులలో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ ఆదేశాల మేరకు 15 ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు జరిపిస్తున్నట్లు తెలిపారు. గర్ల్స్ హైస్కూల్ వద్ద రోడ్డు కు ఏడు లక్షలు, అట్కో కాలనీ రోడ్డుకు 6.02 లక్షలు నిధులతో సిమెంట్ రోడ్లు సీసీ డ్రైన్లు నిర్మాణం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంచార్జ్ కమీషనర్ ఎ.పి.ఎస్.జాన్సన్, పి.వి.వి. కె.రాజు, సంపదరావు మురళి రావు, బివి. రమణమూర్తి, తంగి గురయ్య, కాంట్రాక్టర్ అన్నెపు కృష్ణ కాంత్, నాగళ్ల మురళి, కారుణ్య ధర్మరాజు, ఇంజరాపు విశ్వనాథం, రాజేంద్ర, జగన్నాథం, జగబం ధు, చిన్నారావు, శేఖర్, చిరంజీవి మరియు టిడిపి నాయుకులు అభిమానులు పాల్గొన్నారు.

స్వయం శక్తి మహిళలే మహారాణులు : ఏపీఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర - మందస : పంచ సూత్రాలు పాటిస్తూ , తీసుకున్న రుణాలతో ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తమ కుటుంబాన్ని, పిల్లలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న స్వయం శక్తి మహిళలే నేడు సమాజంలో మహారాణులని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు అన్నారు. గురువారం మండల పరిధి కొత్తపల్లి పంచాయతీ గ్రామ సంఘ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గల 28 స్వయం శక్తి సంఘాల పొదుపులు ,అప్పులు, ఇంటర్నల్ లెండింగ్, పుస్తక నిర్వహణను, పరిశీలిస్తూ, గ్రామ సంఘం పరిధిలో గల సంఘాలతో మాట్లాడి సభ్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో పుస్తక నిర్వహణ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రభుత్వం అర్హులైన సంఘ సభ్యులకు అందిస్తున్న పి.ఎం.ఈ.జి.పి మరియు పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ లోన్స్ గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం మంచి స్వయం శక్తి సంఘాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అందరూ అర్థం చేసుకొని పద్ధతి ప్రకారం కట్టుబాట్లు పాటిస్తూ, సంఘాలను నడిపించుకోవలసిన అవసరం మహిళలకు ఎంతో ఉందని ఏ.పి.ఎం.తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులు, వి.వో.ఏ. బాడ చంద్రకళ, క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ తో పాటు స్వయం శక్తి సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నేడే మామిడి అప్పలసూరి దంపతుల సంస్మరణ సభ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని కోమర్తి గ్రామం వద్ద అమరవీరుల స్థూపం వద్ద విప్లవ ఉద్యమ నేత, శ్రీకాకుళం ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ మామిడి అప్పలసూరి, మరో శ్రీకాకుళం ఉద్యమ నాయకులు, గుమ్మడి లచ్చయ్య, మహిళా ఉద్యమ నాయకురాలు, మామిడి లచ్చమ్మల సంస్మరణ సభ నిర్వహించబడుతుందని సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి, టి.ప్రకాష్, జిల్లా నాయకులు, నేతింటి నీలంరాజు తెలిపారు. గురువారం వారు విశాలాంధ్రతొ మాట్లాడుతూ ఈ సంస్మరణ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాతంత్రవాదులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు, సన్నశెట్టి రాజశేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు, బగ్గు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను మహిళలు మొబైల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర - నరసన్నపేట : మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌ను తమ మొబైల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి యాప్, ఎస్.ఐ, వి.బాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఎల్వీఆర్ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎం.ప్రసాదరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్.ఐ, బాలకృష్ణ మాట్లాడుతూ అపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ ఉపయోగ పడుతుందని, మూడు సార్లు మొబైల్ షేక్ చేసనట్లయితే ఆ ఫిర్యాదు రిజిస్టర్ అయ్యి, 6నుండి 9నిముషాల్లో పోలీసులు వచ్చి, వారి సమస్య పరిష్కారం చేస్తారన్నారు. ఈ యాప్‌లో 13రకాల ఫీచర్లు ఉన్నాయని, ఈ సేవలన్నీ మహిళలకు, విధ్యార్థినులకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, డి.కోటేశ్వరరావు, వై.రాంబాబు, ఎన్ఎస్ఎస్, పిఓ, పి.మోహనరావు, కానిస్టేబుల్, ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం...

విశాలాంధ్ర - మందస : బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందజేయనున్న సబ్సిడీ రుణాల మంజూరుకు ఈ నెల 22వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎన్. రమేష్ నాయుడు తెలిపారు. గురువారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం78 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో శ్లాబ్-1 కింద యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల వరకు బి.సి.ఏ కు 29 యూనిట్లు, బి.సి.బి. 7 యూనిట్లు, బి.సి. డి 19 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు, అలాగే శ్లాబ్-2 కింద యూనిట్ కాస్ట్ 2 నుంచి రూ.3 లక్షల వరకు.. బి.సి.ఏ కు 9 యూనిట్లు బి.సి.బికు 2 యూనిట్లు, బి.సి.డికి 6 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. అదేవిధంగా యూనిట్ కాస్ట్ శ్లాబ్-3 కింద రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు.. బీసీ-ఎ 3 యూనిట్లు, బీసీ-బి 1,యూనిట్లు బీసీ-డి 2 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.. ప్రతి యూనిట్ కూ 50 శాతం రాయితీ వర్తిస్తుంద న్నారు. పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, అన్ని ధ్రువపత్రాలతో సచివాలయం, ఏదైనా ఇంటర్ నెట్ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చన్నారు. సంబంధిత ఆన్లైన్ కాపీని ఎంపీడీఓ కార్యాలయానికి అందజేయాలన్నారు.

పద్మావతిలో విద్యార్థినులకు ప్రత్యేకంగా ఎంసెట్ శిక్షణ

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో విధ్యార్థినులకు ప్రత్యేకంగా ఎంసెట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నిష్ణాతులైన అధ్యాపకులతో ఎంసెట్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసిన విధ్యార్థినులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నెం-9393929359కు సంప్రదించాలని దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన అధ్యాపకులు, విధ్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా ఉచిత టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర - మందస : మండలంలో వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ (బి.సి.కార్పొరేషన్) ద్వారా ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు ఈ నెల 22 తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎన్ రమేష్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను, గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం - కింద 18-50 సంవత్సరాల మధ్య వయస్సు గల వెనుకబడిన తరగతుల లోని పేద వర్గాలకు చెందిన మహిళలకు ఈ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. మహిళల అభివృద్ధికి తోడ్పడే ఈ శిక్షణలో పాల్గొనాలనుకునే అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ/వార్డు సచివాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సంప్రదించవచ్చని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ కూడా అందజేయబడుతుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - టెక్కలి : ఈనెల 21వ తేదీన శుక్రవారం సాయంత్రం మండలంలో బన్నువాడ గ్రామంలో లైంగిక నేరాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జ్ జె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక నేరాలు నుంచి పిల్లల రక్షణ చట్టం 2012 అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై, జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్

సహాయ సంచాలకులు కె.కవిత

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రతి నెల మూడవ శుక్రవారం ని 21వ తేదీ, శుక్రవారం ఉదయం విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం,జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వినతుల స్వీకరణ జరుగునని, ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు.

పేకాట శిబిరం పై దాడి

8600 రూపాయలు స్వాధీనం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామ శివారులో గల తోటల్లో పేకాట శిబిరం పై ఎస్సై వి. రవివర్మ తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ. 8600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐతమ్ విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ మెకానికల్ రెండో ఏడాదికి చెందిన 137 మంది విద్యార్థులకు ఈనెల 11 నుండి 24 వరకు ఎపిఎస్ఎస్‌డిసి సిఎంస్ ఎక్సెలెన్స్ కేంద్రం ద్వారా ప్రొడక్ట్ డిజైన్ అండ్ డ్రాఫ్టింగ్ అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా మని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటలో తెలిపారు. స్కెచ్చింగ్ అండ్ పార్ట్ డిజైన్, అసెంబ్లీ డిజైన్, సర్ ఫేస్ మోడలింగ్ వంటి అంశాలపై శిక్షణ పొందడంవల్ల ఆయా రంగాల్లో విద్యార్థులకు తగిన నైపుణ్యం అలవడుతుందన్నారు. ఈ తరగతులకు ఎపిఎస్ఎస్‌డిసి నుండి కె.ప్రసన్న లక్ష్మి హాజరు కాగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్చడి డాక్టర్ పి.శ్రీహరి, ఎపిఎస్ఎస్ సి స్వాక్ డాక్టర్ బి.రామారావు, మెకానికల్ విభాగ కో-ఆర్డినేటర్ ఎండ సాగర్లు పర్యవేక్షిస్తున్నట్లు ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు తెలిపారు.

సమాజ శ్రేయస్సే అందరి ధ్యేయం కావాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సమాజ శ్రేయస్సు అందరి ధ్యేయం కావాలని గిరిజన యూనివర్సిటీ (విజయనగరం) సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం. నగేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో గురువారం న వరల్డ్ సోషల్ వర్క్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో తరాల వ విద్య అంతరాలు పెరుగుతున్నాయని, దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, మానవ హక్కుల నేత, పాత్రికేయుడు వీఎస్ కృష్ణ, వర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ యస్. కావ్యజ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ కావాలని విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. ఎచ్చెర్లలోని సాయ ధ పోలీసు కార్యాలయాన్ని ఆయన గురువారం వార్షిక తనిఖీ చేశారు. తొలుత గార్డుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. జిల్లా సాయుధ దళాల పనితీరు, ఆయుధాలు, రికార్డులు, మోటారు వాహనాల వినియోగం తదితర వాటిని పరిశీలించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి తీసకుంటున్న చేపడుతున్న చర్యల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ వ హేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ కేవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎల్. శేషాద్రి, టౌన్ డీఎస్పీ వివేకానంద, డీపీవో ఏవో గోపీనాథ్ తదితర లు పాల్గొన్నారు.

మార్చి 22న కోటబొమ్మాళి మండలం సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : మార్చి 22 న కోటబొమ్మాళి మండలం సర్వసభ్య సమావేశం జరుగుతుందని కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఫణీంద్ర కుమార్ గురువారం తెలిపారు. ఈ సమావేశం కోటబొమ్మాళి ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి యధావిధిగా ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచులు అధికారులు సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

సూర్యతేజ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

122 మంది విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - పలాస : స్థానిక సూర్యతేజ డిగ్రీ కళాశాలలో జరిగిన ఉద్యోగ మేళాలో 122 విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ కామేశ్వరరావు తెలిపారు. కళాశాల ఆవరణంలో గురువారం జరిగిన వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ మేళాలో డిగ్రీ, పీజీ పూర్తి అయిన అభ్యర్థులు మరియు ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ ఉద్యోగ మేళా లో 324 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 98 మంది సూర్య తేజ కళాశాల విద్యార్థులు 24 మంది ఇతర కళాశాల విద్యార్థులు ఎంపిక అయినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో ఫోక్సకాన్, బ్లూ స్టార్, ఎన్ ఎస్ ఇన్స్టుమెంటస్, డైకిన్, ఏసియన్ , కోల్గేట్, ట్లాంట్ వార్బ్ , పానాసోనిక్ కంపెనీలు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

ఆ ఇద్దరు కొత్తూరు నేతలు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్...

విశాలాంధ్ర - కొత్తూరు : మండల కేంద్రం కొత్తూరు కు చెందిన ఏ.ఏం.సి మాజీ ఛైర్మెన్ గోగుల వర ప్రసాదరావు నాయుడు కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి ప్రతినిధి పడాల లక్ష్మణరావు లు వైసిపి పార్టీ ని వీడి టీడీపీ పార్టీ లో చేరడంతో సుమారు పది వెలు జనాభా ఉన్న కొత్తూ రులో వైసిపి పార్టీ కి తీరని దెబ్బ అని పరిశీలకులు భావిస్తున్నారు వరప్రసాద్ రావు నాయుడు తండ్రి. దివంగత మాజీ.ఎంపీపీ గోగుల.చెల్లం నాయుడు కు ఓ మంచి రాజకీయ నేత గా ఉంది ఇక కొత్తూరు సర్పంచ్ ప్రతినిది పడా ల లక్ష్మణ రావు కు కూడా గ్రామంలో ఓ. గుర్తింపు ఉంది. ఈ పై ఇద్దరు వైసిపి పార్టీ కి గుడ్బై చెప్పి టీడీపీ పార్టీలో ఎంఎల్ఏ మామిడి గోవిందరావు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ పరిణామం కొత్తూరు వైసిపి పార్టీకి గట్టి దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కింజరాపు కళావతమ్మ ఘాట్ వద్ద నివాళులర్పించిన కుటుంబసభ్యులు

- భావోద్వేగంకు లొనైన కుటుంబ సభ్యులు

- తరలివచ్చిన కింజరాపు అభిమాన గణం, టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - టెక్కలి/కోటబొమ్మాళి/సంతబొమ్మాళి : రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కింజరాపు కీ!శే! కళావతమ్మ ప్రథమ వర్ధంతిని నిమ్మాడ ఘాట్ లో గురువారం ఘనంగా నిర్వహించి ఆమెకు నివాళులర్పించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తోపాటు ఆయన సోదరులు కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్ రావు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దివంగత నేత ఎర్రన్నాయుడు సతీమణి విజయమ్మ నివాళులర్పించారు. మనవడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కుటుంబ సభ్యులు ఇక్కడికి చేరుకుని ఆమెతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కళావతమ్మ స్ఫూర్తి అందుకుని నిమ్మాడ అభివృద్ధికి అలానే జిల్లా అభివృద్ధికీ పని చేస్తామని అన్నారు. కుటుంబాన్ని ఏకతాటిపై నడిపి, అన్న ఎర్రన్న మరణం తరువాత కూడా అదే విధంగా అందరి మధ్య అనుబంధాలను నిలిపి, ఒక గొప్ప మనిషిగా నిలిచిన వైనం తమకొక నిత్య స్మరణీయం అని అచ్చెన్నాయుడు భావోద్వేగం అయ్యారు. అతి సాధారణ కుటుంబం నుంచి అసాధారణ విజయాలు అందుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇవాళ తామంతా అసాధారణ విజయాలు అందుకునేందుకు కారణం తమ మాతృమూర్తి కళావతమ్మ అని అన్నారు. ఇవాళ కింజరాపు కుటుంబాన్ని నమ్ముకుని వేల కుటుంబాలు ఉన్నాయని, వారికి మేలు చేయడం, వారి ఉన్నతికి పాటుపడడం తమ ప్రథమ కర్తవ్యం అని వెల్లడించారు. కొడుకులు, కూతుళ్లు, మనవలు మనవరాళ్లు ఇలా అందరి విజయాలను చూసి, అందరి ఉన్నతిలో భాగం అయి ఆమె చిరాయువు అని కొనియాడారు. తొలుత కింజరాపు కుటుంబ సభ్యులు ఆధునీకీకరణ చేసిన కళావతమ్మ ఘాట్ లో పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి కింజరాపు కుటుంబ సభ్యులు, కూటమి శ్రేణులు చేరుకుని కళావతమ్మ కి నివాళులు అర్పించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు కళావతమ్మకి నివాళులర్పించేందుకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, నిమ్మాడ ఘాట్ వద్దకు చెరుకుని నివాళలు అర్పించారు. కళావతమ్మతో తమకున్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు.